# లలితా త్రిపుర సుందరీదేవి

ప్రాతః స్మరామి లలితా వదనారవిందం
బింబాధరం పృథుల మౌక్తికశోభినాసమ్।
ఆకర్ణ దీర్ఘనయనం మణికుండలాఢ్యం
మందస్మితం మృగమదోజ్జ్వల ఫాలదేశమ్॥




**త్రిపురాత్రయంలో** లలితా త్రిపురసుందరీదేవి రెండో దేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపంలో, సకల లోకాతీత కోమలత్వంతో ప్రకాశిస్తుంది. లలితాదేవి.. మణిద్వీప నివాసిని. సకల సృష్టి, స్థితి, సంహార కారిణి. శ్రీవిద్యా స్వరూపిణి. ఉపాసకులకు ముఖ్య ఆరాధ్య దేవత. 'చిదగ్నికుండ సంభూతా' అంటుంది లలితా సహస్రనామం. 'చిత్' అంటే చైతన్యం. చైతన్యం అనే అగ్నికుండం నుంచి అమ్మ ఆవిర్భవించింది. సకల విశ్వ చైతన్య శక్తి స్వరూపం శ్రీచక్రం. ఈ శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత లలితా త్రిపురసుందరి. కోటి సూర్యుల ప్రకాశంతో సమానమైన కాంతి స్వరూపంతో, చేతిలో పాశం, అంకుశం, చెరకు విల్లు, పూల బాణాలు ధరించి దర్శనమిస్తుంది. లక్ష్మీ, సరస్వతి ఇరువైపులా నిల్చుని వింజామరలతో వీస్తూ అమ్మను సేవిస్తుంటారు. లలితా ఉపాసనతో దారిద్ర్యం నశిస్తుంది. సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయి. అమ్మకు పులిహోర, వడలు, పాయసం నివేదన చేయాలి.

# అట్ల బతుకమ్మ


**తొమ్మిది** రోజులు బతుకమ్మకు పెట్టే ప్రసాదాల్లో నవధాన్యాలు వచ్చేట్టుగా చూడాలంటారు. అటుకుల రూపంలో బియ్యం, ముద్ద పప్పులో కందులు, పెసరపప్పు నివేదిస్తారు. ఇలా సమర్పించే నైవేద్యాలు ఔషధ గుణాలు కలిగి ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తాయి. అట్ల బతుకమ్మ సందర్భంగా పెసర్లు, బియ్యంతో చేసిన అట్లు నివేదిస్తారు. సాధారణంగా అట్లు ఎక్కువగా మినుములతో చేసుకుంటారు. మినుముల్లో మాంసకృతులు ఎక్కువగా ఉంటాయి. బలవర్ధకమైన ఆహారమే అయినా ఎక్కువగా వాడితే బుద్ధి మాంద్యం ఏర్పడుతుంది. పెసర్లు జీర్ణశక్తిని పెంచుతాయి. జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయి. అందుకే తెలంగాణలో అట్ల బతుకమ్మ సందర్భంగా పెసరపప్పుతో చేసిన అట్లను నైవేద్యంగా పెడుతారు.

• డా॥ ఆర్.కమల









పుణ్యమంతా మనదే! ధన్యతంతా వెండితెరదే!!
కృష్ణుణ్ని కండ్లకు కట్టిన ఘనత సినిమాదే!
రాముణ్ని మన ముందు నిలిపిన కీర్తీ చలన
చిత్రానిదే! మహా తపోధనులకు సైతం అర్థం
కాని అమ్మవారి తత్త్వాన్ని సామాన్య
ప్రేక్షకుడికి అర్థం చేసిందీ సినిమానే!
ఎంతలా అంటే.. అది సినిమా అని తెలుసు,
అమ్మవారి పాత్రలో నటిస్తున్నది మన
లాంటి మనిషనీ తెలుసు! అయినా..
పరాశక్తి సబ్జెక్టుతో సినిమాలు వస్తేచాలు..
థియేటర్ల ముందు వెయ్యినొక్క
కొబ్బరికాయలు పగిలేవి. మంగళ
హారతులు అఖండ జ్యోతిగా వెలిగి
పోయేవి. భక్తి పారవశ్యంలో
కొందరికి పూనకాలు వచ్చేవి.
ఇదంతా సినిమా మహిమే!
అమ్మవారి చిత్రమంటే బొమ్మ
హిట్టు అవ్వాల్సిందే!! అంతగా
జనం ఆదరించేవారు మరి.
అందుకే ఆ ఆదిపరాశక్తి
తన భక్తులకే కాదు.. వెండి
తెరకూ కొంగుబంగారమై
విరాజిల్లుతున్నది.



# వెండితెర కొంగుబంగారం

**సినిమా** క్లైమాక్స్‌లో ఉంది. అమ్మవారి గెటప్‌లో ఉన్న కె.ఆర్.విజయ త్రిశూలం చేతబూనింది. ఆమె కళ్లు అగ్నిగోళాల్లా మండుతున్నాయి. నాలుక ఇంతబారు చాపి.. దుర్మార్గుడైన రక్కసుడి గుండెలపై కాళ్లు పెట్టి త్రిశూలంతో ఒక్కపోటు పొడిచింది. వాడి రక్తం ఆమె ముఖంపై చిందింది. నేపథ్యంలో 'అయిగిరి నందిని నందితమేదిని విశ్వ వినోదిని నందినుతే..' అంటూ మహిషాసుర మర్దని స్తోత్రం వినిపిస్తూ ఉంది. ప్రేక్షకులు భయంతో, భక్తితో.. రోమాంచితమై అలా చూస్తూ ఉన్నారు. థియేటర్ అంతా ధీర గంభీరంగా ఉంది. ఇంతలో ముందులైన్‌లో ఏదో కలకలం. ఆమె ఎవరికో పూనకం వచ్చింది. చుట్టూ ఉన్న వాళ్లు అదుపు చేయలేపోతున్నారు. కూర్చున్న జనాలంతా ఒక్కసారిగా పైకి లేచారు. కళ్లముందు జరుగుతున్న కలామటీని ఆశ్చర్యంగా ఎంజాయ్ చేస్తున్నారు కొందరు. ఇంతలో పైలైన్‌లో ఇంకొకరికి పూనకం. బాల్కనీలో ఇద్దరు ముగ్గురు విరుచుకు పడిపోతున్నారు. థియేటర్ యాజమాన్యం అప్పటికే ముందు జాగ్రత్తగా కొబ్బరికాయలు.. కర్పూరం.. గుగ్గిలం.. వేపమండలు సిద్ధం చేసుకొని ఉంది. పూనకాలు మొదలవ్వగానే.. థియేటర్ అంతా గుగ్గిలం పొగతో నింపేశారు. కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చేస్తున్నారు.. వేపమండలతో వాళ్ల శరీరాలను నిమురుతున్నారు. ఈ హడావిడి సద్దుమణిగేలోపు సినిమాకు శుభం కార్డు పడిపోయింది.

**ఇప్పుడైతే..** ఏసీ థియేటర్లు, మల్టీప్లెక్సులు వచ్చేశాయి. జనాలు తెలివి మీరారు. కానీ, ఒకప్పుడు పరిస్థితి వేరు. సౌకర్యాలతో పనిలేదు. అమ్మవారి సినిమా వచ్చిందంటే పూనకాలు లోడ్ అయ్యేవి. అమాయకత్వం, మూఢత్వం, మూర్ఖత్వం.. మూడింటినీ కలగలుపుకొని మరీ ఉండేవారు జనం. అందులో భాగమే ఈ పూనకాలు.. గుగ్గిలాలు. దీనికి సంబంధించిన ఒక ప్రచారం గురించి ఇక్కడ సరదాగా ప్రస్తావించాలి.

**అది** 1955. అక్కినేని నాగేశ్వరరావు హీరోగా తాపీ చాణక్య దర్శకత్వంలో రూపొందిన 'రోజులు మారాయి' సినిమా విడుదలై థియేటర్లలో ఆడుతున్న రోజులవి. బెజవాడ కనకదుర్గమ్మ కొండ మెట్ల దగ్గర ఓ రాత్రివేళ ఓ రిక్షావాడు బాడుగ కోసం చూస్తూ ఉన్నాడు. ఇంతలో ఓ పెద్దావిడ కొండపై నుంచి దిగి వచ్చింది. అతని రిక్షా ఎక్కి.. ''రోజులు మారాయ్' సినిమా ఆడుతున్న థియేటర్‌కి పోనీయ్ రా..' అన్నది. ఆ రిక్షావాడు ఆమెను థియేటర్‌కి తీసుకెళ్లాడు. ఆమె రిక్షా దిగి, డబ్బులివ్వకుండా థియేటర్లోకి వెళ్లిపోయింది. డబ్బివ్వకుండా వెళ్లిందన్న కోపంతో.. ఆ రిక్షావాడు థియేటర్ ముందే కాపు కాశాడు. సినిమా వదిలారు. ఆ పెద్దావిడా సరాసరి వచ్చి, మళ్లీ అతని రిక్షానే ఎక్కింది. 'ఎక్కడ ఎక్కించుకున్నావో.. అక్కడే దించెయ్యరా..' అన్నది. అతను కోపంతోనే రిక్షా తొక్కుతూ.. ఆమెను కొండ మెట్ల దగ్గర దించాడు. ఆమె మౌనంగా కొండెక్కి వెళ్లి పోతున్నది. అతను పిలుస్తున్నాడు. ఆమె పలకలేదు. అలా వెళుతూ.. వెళుతూ అంతర్ధానమైపోయింది. ఆ రిక్షావాడు చిరాగ్గా తన తలకు చుట్టుకున్న తుండును తీసి విదిల్చాడు. ఆ తుండులో నుంచి నోట్ల కట్టలు పడ్డాయి. జనాల అమాయకత్వానికి ఇదో పరాకాష్ఠ. ఇదే నిజమని ఆ సినిమాకు పోటెత్తారట జనం. అప్పటికే 'రోజులు మారాయి' హిట్ టాక్ తెచ్చుకొని ఆడుతున్నది. 'బెజవాడ దుర్గమ్మ కొండదిగొచ్చి చూసిన సినిమా' అని ప్రచారం జరగడంతో జనాలు ఆ సినిమా థియేటర్లకు క్యూ కట్టారట. జనాల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకోవడంలో ఇదో స్ట్రాటజీ.



**తదనంతర** కాలంలో జనాల సెంటిమెంట్‌ని క్యాష్ చేసుకోవాలనే ఆలోచనలోంచే రకరకాల కథలు పుట్టుకొచ్చాయి. అలా పుట్టిన కథే కె.ఆర్.విజయ నటించిన 'మా ఇలవేల్పు'(1971). ఈ సినిమాకు ముందు అమ్మవారి సినిమాలంటే పౌరాణిక, జానపద తరహాలో ఉండేవి. 'విజయగౌరి', 'శ్రీగౌరీ మహత్మ్యం', 'కనక దుర్గ పూజామహిమ'.. ఇలా అన్నమాట. 50, 60ల్లో తెరపై అమ్మవారు అంటే.. సర్వమంగళగా, దయాస్వరూణిగా కనిపించేది. 'కార్తవరాయుని కథ', 'జగదేకవీరుడి కథ' చిత్రాల్లో మహానటి కన్నాంబ పార్వతీదేవిగా సాక్షాత్కరిస్తే.. 'చెంచులక్ష్మి'లో మహాలక్ష్మిగా అంజలిదేవి దర్శనమిచ్చింది. ఇక భూదేవి అనగానే చటుక్కున్న గుర్తుకొచ్చే రూపం ఎస్.వరలక్ష్మి. 'లవకుశ'లో భూదేవిగా ఆమె నటన చిరస్మరణీయం. 'దక్షయజ్ఞం'లో సతీదేవిగా దేవిక కనిపిస్తే.. 'ఉమాచండీగౌరీ శంకరుల కథ'లో అమ్మవారి మూడు రూపాల్లో అభినయించి భళా అనిపించుకున్నది బి.సరోజాదేవి. ఇక పద్మావతి అంటే సావిత్రి, సత్యభామ అంటే జమున.. ఇవన్నీ మంగళకరమైన శక్తి రూపాలే.



**అయితే..** అమ్మవారిలోని మహిషాసురమర్దని రూపాన్ని తెరపై చూపిస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన సినిమానే 'మా ఇలవేల్పు'. జి.వి.ఆర్.శేషగిరిరావు దర్శకుడు. ఇది పౌరాణికం కాదు, జానపదం కాదు. సమకాలీన సమాజంలో అమ్మవారి మహిమల నేపథ్యంలో సాగే ఫిక్షన్ మూవీ. అప్పట్లో ఇదో కొత్త ఆలోచన. థియేటర్లలో పూనకాలు రావడం మొదలైంది ఈ సినిమా నుంచే! కె.ఆర్.విజయ తొలిసారి అమ్మవారిగా తెరపై కనిపించి కూడా ఈ సినిమాతోనే. ఈ చిత్రం విడుదలైన థియేటర్లన్నీ అప్పట్లో దేవాలయాలుగా మారిపోయాయి. ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. 'మా ఇలవేల్పు' తర్వాత కె.ఆర్.విజయ ఇమేజ్ పూర్తిగా మారిపోయింది. ఆమెను మరో హీరో పక్కన హీరోయిన్‌గా చూడటానికి కూడా జనం ఇష్టపడలేదు. అప్పట్నుంచి అమ్మవారి పాత్రకు కె.ఆర్.విజయ పేటెంట్ రైట్ అనిపించుకుంది. 'మా ఇలవేల్పు' ప్రేరణగా ఆ తర్వాత చాలా సినిమాలు వచ్చాయి. అయితే.. 1982లో వచ్చిన 'కదలివచ్చిన కనకదుర్గ' మళ్లీ ఆ రేంజ్ హిట్టయ్యింది. కె.ఎస్.రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. ఈ సినిమా కథ 'మా ఇలవేల్పు' కథకు దగ్గరగా ఉంటుంది. కానీ.. విజయవాడలో జరిగిన యదార్థగాథ అంటూ అప్పట్లో పబ్లిసిటీ ఊదరగొట్టి, జనాన్ని ఆకర్షించారు. ఇప్పటికీ అది నిజంగా జరిగిన కథ అని నమ్మేవాళ్లు లేకపోలేదు.

**ఈ** రెండు సినిమాల తర్వాత అమ్మవారి నేపథ్యంగా వచ్చిన చిత్రాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేంత చరిత్ర సృష్టించిన సినిమా కోడి రామకృష్ణ 'అమ్మోరు' (1995). గ్రాఫిక్ మాయాజాలంతో జనాన్ని మెస్మరైజ్ చేసిన మూవీ ఇది. కె.విశ్వనాథ్ 'ఉండమ్మా బొట్టుపెడతా'(1968), 'మా ఇలవేల్పు'.. ఈ రెండు కథల్ని కలిపి తయారు చేసిన కథ 'అమ్మోరు'. నిర్మాత శ్యామ్ ప్రసాద్‌రెడ్డి అభిరుచి, రాజీలేని నిర్మాణ విలువలు, కోడి రామకృష్ణ దర్శకత్వ ప్రౌఢి 'అమ్మోరు'ను తెలుగు సినీ చరిత్రలోనే ఓ క్లాసిక్‌గా నిలబెట్టాయి. కథానాయికగా సౌందర్యకు, అమ్మవారిగా రమ్యకృష్ణకు ఎనలేని గుర్తింపును తెచ్చిపెట్టిన సినిమా ఇది. అమ్మవారి సినిమాలు ఎన్ని విడుదలై, విజయాలను అందుకున్నా.. 'మా ఇలవేల్పు', 'కదలివచ్చిన కనకదుర్గ', అమ్మోరు చిత్రాలు మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే!

**అమ్మవారి** నేపథ్య కథాంశాలతో రూపొంది భారీ విజయాలను అందుకున్న ఇతర సినిమాల విషయానికొస్తే.. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి, నటి జయలలిత నటించిన 'ఆదిపరాశక్తి', ఎస్.వరలక్ష్మి నటించిన 'పరాశక్తి మహిమలు'. కె.ఆర్.విజయ నటించిన 'జై సంతోషి మాత', 'అష్టలక్ష్మీ వైభవం', 'జగన్మాత' చిత్రాలతో పాటు 'శ్రీదేవి కామాక్షి కటాక్షం', 'శ్రీశైల భ్రమరాంబికా మహాత్మ్యం', 'మధుర మీనాక్షి..' ఇలా చాలా సినిమాలు ఉన్నాయి. రీసెంట్‌గా నేటి లేడీ సూపర్‌స్టార్ నయనతార కూడా 'మూకుతీ అమ్మన్' సినిమాలో అమ్మవారిగా మెరిసింది.

**చివరిగా** చెప్పొచ్చేదేంటంటే.. సమస్త బ్రహ్మాండాలూ అమ్మనుంచే ఉద్భవించాయని శాస్త్రవచనం. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకి అయిన అలాంటి అమ్మ.. తుచ్ఛమైన మానవశరీరంలోకి ప్రవేశిస్తుందనుకోవడం అమాయకత్వమే! రక్షించడానికీ, శిక్షించడానికీ అమ్మ దిగిరావాల్సిన అవసరం లేదు. అమ్మ అంతా వ్యాపించి ఉంటుందనీ, సర్వం శక్తిమయం అనీ తెలిసినా.. ఆ నిజాలు ప్రేక్షకులకు రుచించవ్. అబద్ధాన్నే ఎంజాయ్ చేస్తారు. భక్తి, నమ్మకం నుంచి పుట్టుకొచ్చే భావోద్వేగం అత్యంత శక్తిమంతం. దానికి అడ్డు చెప్పలేం.. అడ్డు కట్ట వేయలేం. సినిమా ఎలా ఉన్నా.. అమ్మ కృపాకటాక్ష వీక్షణాలు మాత్రం అందరిపై సదా ఉంటాయి.

... బుర్రా నరసింహా

## శ్రీ గౌరి నీ పూజ ఉయ్యాలో

శ్రీ గౌరి నీ పూజ ఉయ్యాలో
బంగారు చెంబుల ఉయ్యాలో
జలతారు చీరలు ఉయ్యాలో
చేయబూనితిమమ్మ ఉయ్యాలో
గంగ ఉదకం తెచ్చి ఉయ్యాలో
అద్దాల రవికలు ఉయ్యాలో
కాపాడు మమ్ముల ఉయ్యాలో
కాంత నీ పాదాల ఉయ్యాలో
అద్దాల రవికలు ఉయ్యాలో
కైలాసరాణీ ఉయ్యాలో
కడిగి తరియింతుము ఉయ్యాలో
అమ్మ నీకిచ్చెద ఉయ్యాలో
శంకర పార్వతి ఉయ్యాలో
నీలకంఠపు రాణి ఉయ్యాలో
శంభునిరాణి ఉయ్యాలో
అంబికా నీకిదే ఉయ్యాలో
నీలవేణి రాణి ఉయ్యాలో
శంకర పార్వతి ఉయ్యాలో
అర్ఘ్యంబులిచ్చెద ఉయ్యాలో
ప్రేమ పువ్వుల మాల ఉయ్యాలో

శంభునిరాణి ఉయ్యాలో
ఆకాశగంగతో ఉయ్యాలో
తల్లి నిన్నెప్పుడూ ఉయ్యాలో
ఆదరించుము తల్లి ఉయ్యాలో
నీ కేసి పూజింతు ఉయ్యాలో
ధ్యానింతుమమ్మ ఉయ్యాలో
జలజాక్షి పందిట ఉయ్యాలో
జయము నీకు తల్లి ఉయ్యాలో
కలహంస నడకల ఉయ్యాలో
జలకమాడుమమ్మ ఉయ్యాలో
శుభము మాకు తల్లి ఉయ్యాలో
కలికి రాణివమ్మ ఉయ్యాలో
బంగారు చీరలు ఉయ్యాలో
జయము నీకు తల్లి ఉయ్యాలో
సింహపీఠంబున ఉయ్యాలో
శాంభవి నీకమ్మ ఉయ్యాలో
శుభము మాకు తల్లి ఉయ్యాలో.
చెలియకూర్చుండమ్మ ఉయ్యాలో
జలతారు చీరలు ఉయ్యాలో
అద్దాల రవికలు ఉయ్యాలో

# ఆ ఫొటోలు కాల్చేశా

**బాలీవుడ్‌లో** సంచలనాలకు కేరాఫ్.. అనన్య పాండే! కెమెరా లెన్స్ మాత్రమే కాదు.. మీడియా హెడ్‌లైన్స్ కూడా ఎప్పుడూ ఈ బ్యూటీ మీదే! ఈమె వృత్తి జీవితమే కాదు.. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఏ విషయమైనా సెన్సేషనే! అనన్య ఏం చేసినా.. సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావాల్సిందే! ఇటీవలే 'కాల్ మీ బే' వెబ్ సిరీస్‌తో మంచిహిట్ అందుకున్నదామె. ప్రస్తుతం 'కంట్రోల్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ క్రమంలోనే పలు టీవీ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ.. తన గురించి ఎన్నో విషయాలను పంచుకున్నది. అవన్నీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తన బ్రేకప్ గురించి చెప్పిన మాటలు.. సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఆ సమయంలో తన భావోద్వేగాలను ఎలా అదుపు చేసుకున్నదో.. ఆ బాధను ఎలా అధిగమించిన విధాన్ని బయటపెట్టింది. 'జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే సత్యాన్ని అప్పుడే గ్రహించాను. కోపంతో నా ఎక్స్ బాయ్‌ఫ్రెండ్ ఫొటోలను తగలబెట్టేశాను. నాలో గూడుకట్టుకొన్న నిరాశ – నిస్పృహలను ఈ విధంగా బయటపెట్టుకున్నాను. ఆ సమయంలో 'జబ్ వీ మెట్' చిత్రంలో కరీనాకపూర్ పోషించిన 'గీతూ' పాత్ర నన్ను పూనిందేమో అనిపించింది. ఆ చిత్రంలో గీతూ కూడా ఇలాగే.. బ్రేకప్ నుంచి బయట పడేందుకు విచిత్రమైన మార్గాలను ఎంచుకుంటుంది. తన ఎక్స్ బాయ్‌ఫ్రెండ్ ఫొటోలను కూడా కాల్చేస్తుంది!' అంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నది అనన్య. ఇక 'స్పెషల్ సాంగ్స్' చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అంటూనే.. అతిగా అందాల ప్రదర్శన మాత్రం ఉండకూడదనీ కండీషన్స్ పెడుతున్నది. కథను నమ్మి 'కంట్రోల్' సినిమా చేశానని చెప్పుకొచ్చింది. తాను ప్రయోగాలకు పెద్దపీట వేస్తాననీ, ప్రయోగాలు చేస్తే.. ఎవరైనా ఇండస్ట్రీలో ఎదుగుతారనీ అంటున్నది. విక్రమాదిత్య దర్శకత్వం వహించిన 'కంట్రోల్ (CTRL) ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ టాక్ సొంతం చేసుకుంది.



# 'చిత్ర' విచిత్రాల శ్రీవల్లి!

**నేషనల్** క్రష్.. రష్మిక! 'బ్లాక్‌బస్టర్ హిట్స్'ను సొంతం చేసుకుంటూ.. తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిపోయింది. ఒకవైపు తీరికలేకుండా సినిమాలు చేస్తున్నా.. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటుందామె. తనకు సంబంధించిన తాజా ఫొటోలు, వీడియాలను ఎప్పటికప్పుడు షేర్ చేస్తుంది. తాజాగా, ప్రేమను పలురకాలుగా వ్యక్తం చేస్తూ ఫొటోలకు ఫోజులిచ్చింది. వివిధ రకాలుగా లవ్ సింబల్స్ క్రియేట్ చేసి.. తన ఫ్యాన్స్‌పై తనకున్న ప్రేమనంతా వ్యక్తం చేసింది. ఒక్కో ఫ్రేమ్‌కు ఒక్కో లవ్ సింబల్ వచ్చేలా దిగిన ఆ ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. 'హృదయాన్ని లక్ష విధాలుగా తయారుచేయగలిగేది నేనొక్కదాన్నే!' అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఓవైపు ఈ ఫొటోలు వైరల్ అవుతుండగానే.. మరోవైపు రష్మికకు సంబంధించిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టేస్తున్నది. తాను బీఏ చదువుతున్నడు ఇచ్చిన ఆడిషన్‌కు సంబంధించిన వీడియో అది. ముద్దుముద్దు మాటలు, ముచ్చటైన యాక్టింగ్‌తోపాటు అదిరిపోయే డ్యాన్స్‌తో ఉన్న ఈ వీడియో.. నెటిజన్లను తెగ అలరిస్తున్నది. ''హాయ్! నేను రష్మిక! వయసు 19. ఎత్తు 5.5. నేను బీఏ రెండో సంవత్సరం చదువుతున్నా!'' అంటూ ఇంట్రో ఇచ్చిన రష్మిక.. ఆ తర్వాత 'మాధురీ దీక్షిత్ ఆజ నాచ్‌లే!' పాటపై స్టెప్పులేసింది. కన్నడలో కొన్ని డైలాగ్స్ చెప్పి అలరించింది. 'పుష్ప-1' తోపాటు 'యానిమల్' చిత్రాలతో ఆలిండియా స్టార్ ర్యాంక్ కొట్టేసిన రష్మిక.. ప్రస్తుతం 'పుష్ప-2'తో బిజీగా ఉన్నది.

